వీధికుక్కల బెడదకు చెక్


కుక్కకు యాంటి రెబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

- కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు
- పేట మున్సిపాలిటీలో గుర్తించిన శునకాలు 980
- మొదటి విడతలో 273... రెండో విడతలో 115

నారాయణపేట: జిల్లా కేంద్రమైన నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా అధికారులు వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ దిశా నిర్దేశంతో మున్సిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశానుసారం మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్ సూచనలతో మున్సిపల్ అధికార యంత్రాంగం, సిబ్బంది బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో వీధుల్లో కుక్కలను పట్టి వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నారు. తద్వారా అవి పిల్లల్ని కనకుండా ఉంటాయి. జంతువుల సంరక్షణకు సంబంధించిన నియమాలను పాటిస్తూ వీధి కుక్కల సంరక్షణకు చర్యలు చేపట్టారు.

మొదటి విడతలో 273

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో మొదటి విడతలో హైదరాబాద్ వారి స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ నేతృత్వంలో 273 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేసి వీధుల్లో వదిలేశారు. కాగా మిగతా కుక్కలను పట్టుకొని వ్యాక్సినేషన్ వేయాల్సి ఉండగా అనివార్య కారణాలతో ఆ సంస్థ తప్పుకుంది. దాంతో పెండింగ్‌లో పడినట్లయింది.

ఆరు నెలల్లోపు ఆపరేషన్లు

2వ విడతలో 1650 చొప్పున ఒక కుక్కకు ఆపరేషన్, వ్యాక్సిన్ చేసి వదిలి పెట్టేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపాలిటీ నుంచి బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు ఒప్పందం కుదుర్చుకున్నారు. జూలై మొదటి వారం నుంచి పట్టణంలోని వాడ వాడల్లో కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి మళ్లీ వీధుల్లో వదులుతున్నారు. ఇప్పటికే 115 కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆరు నెలల్లోపు పట్టణంలో ఉన్న కుక్కలన్నీ పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వదిలివేయడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట

వీధి కుక్కలు ప్రజలపై దాడి చేసే అవకాశం ఉండడంతో వాటి నియంత్రణకు మున్సిపల్ అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో పట్టణ ప్రజల భద్రతకు చొరవ చూపినట్లయింది. వీధి కుక్కల సంఖ్య పెరిగితే, వాటికి ఆహారం, నీరు దొరకడం కష్టతరమవుతుంది. కాబట్టి శునకాల జనాభాను నియంత్రించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని కాపాడొచ్చు. వీధి కుక్కల ద్వారా కొన్ని వ్యాధులు మనుషులకు, ఇతర జంతువులకు వ్యాపించే అవకాశం ఉండడంతో నియంత్రణ చర్యల ద్వారా ఈ వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని పశుసంవర్ధక శాఖ వైద్యులు చెబుతున్నారు.

కుక్కలకు కుటుంబ నియంత్రణ ఇలా

ఒక్కొక్క కుక్కను పట్టుకొని మున్సిపాలిటీకి చెందిన డంపింగ్‌యార్డులో ఏర్పాటుచేసిన ఓ ప్రత్యేక గదిలో మూడు రోజుల పాటు అక్కడే పెట్టి పశుసంవర్ధక శాఖ వైద్యులతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. వెటర్నరీ వైద్యుల సలహాలతోనే సిబ్బంది వాటికి యాంటి రేబీస్ వ్యాక్సిన్ వేయించి మళ్లీ ఏ వీధిలో అయితే పట్టుకొస్తారో అక్కడే వదిలేస్తున్నారు. దీంతో కుక్కల బెడద నుంచి ముప్పు తప్పుతుండడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలన్నింటికీ రెబీస్ వ్యాక్సిన్



బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో కుక్కలకు యాంటి రేబీస్ వ్యాక్సినేషన్‌ను వేయించేందుకు చర్యలు చేపట్టాం. వీధి కుక్కల బెడదను తప్పించడానికి వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు సైతం చేయిస్తున్నాం.

– భోగేశ్వర్, మున్సిపల్ కమిషనర్

ఓడినా.. గెలిచినా మీతోనే ఉంటా

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణా: ఎన్నికల్లో నేను ఓడినా.. గెలిచినా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు తోడుగా ఉంటానని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముడుమాల్ గ్రామ శివారులోని అశోక్‌గౌడ్ తోటలో ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన 18 నెలల కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని, తమ పరిపాలనను జ్ఞాపకం చేసుకుంటున్నారన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువ అయ్యాయని ఎవ్వరు కూడా భయపడవద్దని, తాను కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. తమ పరిపాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులకు అందించామని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కేవలం వారి పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇరవై ఏళ్లుగా తన కుటుంబాన్ని వదిలి నియోజకవర్గ ప్రజలతోనే ఉన్నానని, ఇప్పుడు ఓడినా కూడ తనను నమ్ముకున్న ప్రజల కోసం మక్తల్‌లోనే ఉంటున్నట్లు తెలిపారు. సమావేశంలో చిట్టెం సుచరిత, పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆశిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నర్సింహాగౌడ్, రాజేష్‌గౌడ్, శివరాజ్ పాటిల్, అశోక్‌గౌడ్, ఎల్లారెడ్డి, అంబ్రేష్, శివప్ప, శంక్రప్ప, కేసీఆర్, రవి, రాఘవేంద్ర, పల్లె మారెప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు కాదు.. అభివృద్ధి చేయండి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మక్తల్: కాంగ్రెస్ నేతలు ఆరోపణలు మాని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని మక్తల్ బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసస్థలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లో చేసిందేమీలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే మంజూరై పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభించి డప్పు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అదృష్టం కొద్ది వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వచ్చిందని, ఇప్పుడైనా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు నర్సింహాగౌడ్, రాజేశ్‌గౌడ్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చిన్నహన్మంతు, గాలిరెడ్డి,అన్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మరికల్: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రాము సూచించారు. బుధవారం మణికంఠ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసైతే బంగారం లాంటి జీవితం నాశనం అవుతుందన్నారు. పోక్సో కేసులో ఇరుకుంటే జీవితాంతం జైలులో ఉండాల్సి వస్తుందని, ప్రేమ పెళ్లి జోలికి వెళ్లకుండా లక్ష్యం పెట్టుకొని చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో మైభారత్ కోఆర్డినేటర్ అనిల్‌గౌడ్, అనితరెడ్డి, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, అంజప్ప, శేఖర్, హర్షవర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, స్వప్న, అనిత, విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను అరికట్టండి



మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. నిరంతరాయంగా బల్బులు వెలగడంతో విద్యుత్ వృథా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని వడ్వాట్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, వర్కూర్, నేరడగం, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో 24 గంటల పాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

రైతు గుర్తింపు కార్డు ప్రక్రియ వేగవంతం

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతు గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. కొత్తపల్లి మండలంలో 7425 మంది రైతుల ఖాతాలు ఉండగా మంగళవారం నాటికి 3270 మంది రైతు గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకున్నారు. మిగిలిన 4155 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉందని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. ప్రతి రైతు విధిగా రైతు గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని కోరారు.

అటల్ టింకర్ ల్యాబ్ ప్రారంభం



మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం అటల్ టింకర్ ట్రినింగ్ సెషన్ ల్యాబ్‌ను హెచ్‌ఎం నాగరత్నమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ పైన అవగాహన కల్పించేందుకు ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు సైన్స్‌లో రాణించేలా ప్రభుత్వం అటల్ టింకర్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు వివరించారు.

సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి



దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామ్ల సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని బుధవారం మూడ నమ్మకాల నిర్మూల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ చక్రవర్తి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. ఈమేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వు కాలేదన్నారు. గ్రామంలో 400 లకు పైగా ఎస్సీ ఓటర్లు ఉన్న రిజర్వేషన్ కల్పించడం లేదన్నారు. ఎస్సీల అభ్యున్నతికి సర్పంచ్ స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం జిల్లా నాయకులు గలజప్ప, లాలు, రమేష్, బాలప్ప, కాశప్ప, రాజులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహా రెడ్డి

కొత్తపల్లి: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని గృహనిర్మాణ శాఖ డీఈ హరికృష్ణ సూచించారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం కొత్తపల్లి ఎంపీడీఓ కృష్ణారావ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బేస్ మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.లక్ష బిల్లును వారి వ్యక్తిగత ఖాతాలో త్వరలోనే జమ చేస్తామన్నారు. అలాగే మండలంలోని ఎక్కామేడ్‌లో నిర్మాణమవుతున్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని, ప్రభుత్వం నగదును విడతల వారిగా జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతి కార్యదర్శులు,హౌసింగ్ ఏఈ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మద్దూరు: మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓ నర్సింహారెడ్డి పరిశీలించారు. మండల పరిధిలోని హన్మా నాయక్ తండాను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో ప్రభుత్వం తండాకు 90 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 54 ఇళ్లు నిర్మాణం కొనసాగుతుండగా 15 ఇళ్లు పూర్తయ్యే దశలో ఉండడంతో బుధవారం ఎంపీడీవో ఆ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు జనార్థన్‌రెడ్డి

ఊట్కూరు: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ సంఘం ఎనలేని కృషి చేస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై జనార్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపొర్ల, పులిమామిడి, కొండూరు, మల్లెపల్లి, ఊట్కూరు పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల మేరకు సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు విడుదల, 50 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్‌సీ, బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, కలాం, విక్టర్‌పాల్, గురునాథ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంత ఏర్పాటు.. పూడ్చివేత


ఓబులాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

ఊట్కూరు: ప్రభుత్వం భూగర్భ జలాలను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో రూ.వేలు ఖర్చు చేసి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తుంది. అయితే కొంత మంది అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. మండలంలోని ఓబులాపూర్ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో 6 నెలల క్రితం ఉపాధిహామీ పథకంలో భాగంగా ఇంకుడు గుంతను నిర్మించారు. అయితే నిర్మించిన కొద్ది రోజులకే విద్యుత్ అధికారులు ఇంకుడు గుంతను మట్టితో పూడ్చివేశారు. విషయం తెలిసినా ఉపాధిహామీ సిబ్బంది కానీ గ్రామపంచాయతీ సిబ్బంది కానీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఏపీఓ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా తన దృష్టికి రాలేదని సంఘటన స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

బీసీలు స్థానిక సంస్థలకే పరిమితమా?

నారాయణపేట: స్థానిక సంస్థల రిజర్వేషన్ల పేరుతో మరో సారి బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీఎస్పీ స్వాగతిస్తుందన్నారు. కానీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేస్తుందా అని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ తేవడం కాదు అసెంబ్లీ, పార్లమెంటులో వారి జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. కేవలం ఎంపీటీసీ, సర్పంచులకే బీసీలను పరిమితం చేసి చట్ట సభల్లో బీసీల స్థానాలను ఆధిపత్య కుల పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ కబ్జా చేసి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆధిపత్య కుల పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలను నమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో రాష్ట్ర ఈసీ మెంబర్ జుట్ల నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

మక్తల్: పాముకాటుకు వ్యక్తి మృతిచెందిన ఘటన మక్తల్ మండలం జక్లేర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కతలప్ప(45) ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటువేసింది. దీంతో వ్యక్తి నోటి నుంచి నురగు రావడంతో కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అంతలోపే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృత్యుడికి భార్య, ముగ్గురు పిల్లలు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జీపీ అవార్డుల ఎంపిక నివేదిక ఇవ్వాలి

అమరచింత: ఉత్తమ పంచాయతీలకు ఎంపిక చేసేందుకు ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి కోరారు. బుధవారం అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో జరిగే ఉపాధి పనులు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, పోలీసు క్రైం రేటు, వైద్యసేవలతో పాటు ఇతర కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయనే విషయాలపై నివేదికను సేకరించి ఇవ్వాలన్నారు.

నేడు మక్తల్‌కు మంత్రి రాక

మక్తల్: మంత్రి వాకిటి శ్రీహరి గురువారం మక్తల్ పట్టణంలో పర్యటించనున్నారు. పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీ మహిళలకు మైనార్టీ కార్పొరేషన్ పథకం కింద మంజూరైన కుట్టుమిషన్లను మంత్రి పంపిణీ చేయనున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. అలాగే సీఎం సహాయనిధి చెక్కులను కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని లబ్ధిదారులు, స్థానిక నాయకులు తప్పక హాజరు కావాలని సూచించారు.

వరుణుడి కోసం ఎదురుచూపులు



కొత్తపల్లి: తొలకరి వర్షాలతో మండలంలోని రైతులు ఖరీఫ్ సాగులో కంది, పెసర, జొన్న సాగుకు విత్తనాలు వేశారు. ప్రస్తుతం జొన్న మొక్కలు కాండం దశలో ఉండటంతో మొక్కలకు నీటి లభ్యత అవసరమైన దశలో వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు వరుణుడి కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. 20 రోజుల నుంచి వర్షం పడకపోవడంతో రైతన్న ఆకాశం వైపు చూస్తూ ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకో వారం రోజులలోపు వర్షం పడకపోతే మండలంలో వందల ఎకరాల్లో సాగు చేసిన జొన్న పంట చేతికి వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి



నర్వ: బాలికలు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని విశ్రాంత పీఈటీ, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం అన్నారు. బుధవారం నర్వ కేజీబీవీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 13న మక్తల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ సైకిల్ 10 కిలోమీటర్ల పోటీలలో నర్వ కేజీబీవీ విదార్థినులు ప్రతిభ కనబరిచారన్నారు. పోటీల్లో గంగోత్రి ద్వితీయస్థానం, సుకన్య నాలుగో స్థానం, భార్గవి ఐదో స్థానం సాధించి ఖేలో ఇండియా సౌత్‌జోన్ బాలికల సైకిల్ పోటీలకు ఎంపికైనారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ శిరీషా, పీఈటీ త్రివేణి, ఉపాధ్యాయులు హారిక, సుజాత, స్వాతి, వెన్నెల, సరోజ, రాధిక, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఎఫ్‌పీఓలో సభ్యత్వం తీసుకోవాలి

ధన్వాడ: రైతులు తమ ఉత్పత్తులను లాభాదాయకంగా విక్రయించుకునేందుకు ప్రతి రైతు రూ.2వేలు చెల్లించి రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ)లో సభ్యులుగా చేరాలని ధన్వాడ సింగల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి సూచించారు. బుధవారం ధన్వాడ రైతు వేదికలో ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విండో పరిధిలోని రైతులు 750 మంది సభ్యులుగా చేరితే ప్రభుత్వం రూ.15 లక్షల గ్రాండ్ అందజేస్తుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా మండలంలో కొండాపూర్ గ్రామంలో పెట్రోల్ బంకు ధన్వాడ, మరికల్ గ్రామాలలో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకట్రాములు, డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, భాగ్యమ్మ, మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్, ఏఈఓ సైమన్, మాజీ ఎంపీటీసీలు గోవర్ధన్‌గౌడ్, ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతు పనులకు ఆటంకం


కాలువ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ సురేష్‌కుమార్

మాగనూర్: సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి లోలెవల్ కెనాల్‌తో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కాస్తా అన్నదాతలకు శాపంగా మారింది. ఇప్పటికే మండల వ్యాప్తంగా జోరుగా వరినాట్లు కొనసాగుతుండంగా.. మాగనూర్, అచ్చంపేట, పెగడబండ గ్రామాల రైతులకు మాత్రం సాగునీరు అందక వరి నాట్లు ఆగిపోయిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ క్రమంలో రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇరిగేషన్ అధికారులు బుధవారం కాలువలోని ఆపు(తుంగ)ను తొలగించేందుకు పనులు మొదలుపెట్టారు. ఈ పనులను ఇరిగేషన్ డీఈ సురేష్‌కుమార్ పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులు కాలువ వెంబడి ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన స్తంభాలతో పనులకు ఆటంకం కలుగుతున్నట్లు డీఈ తెలిపారు. ఇదే విషయంపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించగా రైతులు స్తంభాలను పొలాల్లో వేసుకోవాలని చెప్పినా వినకపోవడంతోనే సమస్య ఉత్పన్నమయినట్లు తెలిపారు. ఏది ఏమైనా అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు


సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, కాంగ్రెస్ నాయకులు

నర్వ: గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు గ్రామాభివృద్ధికి మంత్రి వాకిటి శ్రీహరిరి ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా నిధులు మంజూరు చేసినట్లు డీసీసీ జనరల్ సెక్రటరీ నాగన్నగారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో రూ.10 లక్షల నిధులలో రూ.7 లక్షలతో డ్రైయినేజీ నిర్మాణ పనులు, రూ.3 లక్షలతో సీసీ రహదారి పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. మంత్రి సహకారం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ చొరవతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనువాసులు, వివేకవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచు వెంకటయ్య, నాయకులు నర్సిహారెడ్డి, రామేశ్వరమ్మ, రాజేశ్వర్‌రెడ్డి, జైపాల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మద్దూరు: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు లేక, ప్రధానంగా మూత్రశాలలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మహమూద్‌అలీ, పవన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని, మండల కేంద్రంలో నిర్మించే గురుకుల పాఠశాల భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ తహసిల్దార్ మహేశ్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

బ్యాంక్ ఎదుట సీపీఐ నాయకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట గోల్డ్ రుణాలను ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు పట్టణ కార్యదర్శి అబ్రహాం, సహాయ కార్యదర్శి భాస్కర్‌లు మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి బ్యాంకు మెనేజర్ బంగారు నగలను తాకట్టు పెట్టుకుని రుణాలను ఇవ్వమని ప్రజలు,రైతులు తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎర్రన్న, కుతుబ్, సాలు, ఖాతాదారులు పాల్గొన్నారు.